# మంత్రాలకు చింతకాయలు

-'వింధ్యవాసిని'

మా అబ్బాయి ఇంటర్ స్టేట్ టేబిల్ టెన్నిస్ మాచెస్‌కి సెలక్టు అయినప్పటినుంచి మా ఆవిడ సంతోషానికి అవధు ల్లేవు. నెల రోజులనుంచి వాడికి బెంగుళూరు వెళ్ళేందుకు కావలసిన ఏర్పాట్లన్నీ చేస్తూంది.

రేపే వాడి ప్రయాణం. ఆఫీసు నుంచి వచ్చేసరికి చాలా బిజీగా ఉంది జయ.

కుర్చీలో అలా కూర్చుని, షూ విప్పానో లేదో కాఫీ కప్పుతో ప్రత్యక్షమయింది. 'ఫరవాలేదు. ఇంత హడావిడిలోనూ నాకు కాఫీ ఇవ్వటం మరిచి పోలేదు' అనుకుంటూ అందుకున్నాను కాఫీ.

"కాస్త బరువు చూసుకో రాదూ?" అన్నాను, సీరియస్‌గా ఆమెను పై నుంచి కిందికి చూస్తూ.

"పొండి! నే నెంత ఎక్సర్‌సయిజు, డయటింగ్ చేసినా మీ కళ్ళకు లావవుతున్నట్టే కనిపిస్తాను. 'సన్నబడ్డావోయ్!' అని ఏ రోజయినా అంటారా?" చిరుబురుమన్నది జయ.

"కొడుకు ఇంటర్‌స్టేట్‌కి సెలక్టు అయినప్పటినుంచి సంతోషంతో గాలి కొట్టినట్టు అయిపోతున్నావేమో, 'బరువు చూసుకుందూ' అన్నా నంతే."

మూతి మూడు వంకర్లు తిప్పుతూ, "ఆలాగేం! ఇప్పు డెందుకూ? నా కొడుకు బెంగుళూరు వెళ్ళి, గెలిచి ఇంటికి రానీ. అప్పు డొకేసారి చూసు కుంటాను" అనేసి వెళ్ళిపోయింది.

అలా అన్నదని జయకు 'సెన్సాఫ్ హ్యూమర్' తక్కువనుకునేందుకు వీలు లేదు. ఆమెకు నాతో పోట్లాడటం సరదా. అంతే!

అలా లోపలికి వెళ్ళిందో, లేదో ఇలా మా బంగారు తల్లి ( పేరు శైలజ ) నా ఎదురుగా ప్రత్యక్షం అయి, "నాన్నా! అమ్మ పిలుస్తూంది" అనేసి అదృశ్యం అయిపోయింది. అది ఎప్పుడు, ఎక్కడ ఉంటుందో ఎవరూ చెప్పలేరు. ఎప్పుడూ జెట్ స్పీడ్‌లో పరుగులు తీస్తూంటుంది.

కప్పు ఖాళీ అయింది. పట్టుకెళ్ళి వంట గది సింక్‌లో కడిగి, షెల్ఫ్‌లో ఉంచాను.

"ఏమిటోయ్! ఏదయినా సలహానా?"

చలపతి గదిలో వాడు ఊరు తీసుకు వెళ్ళవలసిన సూట్‌కేస్‌లో బట్టలు సర్దుతూంది జయ.

"మరే. బెంగుళూర్లో చాలా చలిగా ఉంటుంది గదండీ? ఈ చిన్న సూట్‌కేస్ బట్టలకే సరిపోయింది. మంచి ఉలెను బ్లాంకెట్ ఒకటి పెడదామంటే. . ."

"ఇంకా నయం. ఒక పరుపూ, మంచం పాక్ చేసి ఇస్తానన్నావు కాదు. పిచ్చిదానా! ప్లేయర్స్ అందర్నీ మంచి హోటల్స్‌కు తీసుకు వెళతారు—తెలుసా? అక్కడ సోపు, టవలు లాంటి వస్తువులు మొదలు మంచం, పరుపు, దుప్పటి దాకా అన్నీ ఉంటాయి."

"ఏమోనండీ! చలికి ఏ జలుబో చేస్తే. . ."

"ఏమిటోయ్ నీ పిచ్చి? అయినా, ఇదింకా ఆగస్టే కద! జలుబు చేసేంత చలేం ఉండదులే" అనేసి అవతలికి నడిచాను.

ఆమెకు నాతో పోట్లాడటం లాగే, చిన్న చిన్న సమస్యలు కల్పించుకుని 'ఎలా, ఎలా' అనుకోవటమూ సరదాయే.

ఒక గంట సేపు పేపర్ రీడింగ్‌లో మునిగిపోయాను.

'చలా' వచ్చినట్లున్నాడు. "అన్న య్యొచ్చాడమ్మా" అని శైల కేక వేయటం వినిపించింది.

"చలా! సుస్తీగా ఉందేమిటి? అలా డల్‌గా ఉన్నావేం? ఉండరా. కాఫీలో గ్లూకోజ్ వేసి ఇస్తాను. పొద్దుటినుంచి ప్రాక్టీసుతో ఎంతగా అలిసి పోయావో?"

"నా కేం వద్దమ్మా. సుస్తీ ఏం లేదులే. కొంచెం నాన్నగార్ని వెళ్ళి మా మాస్టారికి చెప్పి రమ్మను, నేను రేపు బెంగుళూరికి రావటం లేదని."

"అయ్యో, ఇదేమిట్రా! పిచ్చెక్కినట్లు మాట్లాడుతున్నావు. బాగానే ఉందంటావ్. ఊరెళ్ళనంటావ్? అస లేం జరిగిందో చెప్పరా చంపక."

"నా రాకెట్ విరిగిపోయింది."

"మరి ఇదెక్కడిది?"

"కొత్తది ఇది. కాలేజిలో తెప్పించి ఇచ్చారు, రేపు వెళ్ళటం కోసం."

"మరి ఇంకేం? పాతది పోతే పోయింది. ఇప్పుడు కొత్తది రావటం మంచిదే అయింది. బాగా ఆడవచ్చు గద?"

"మీకు తెలియదులే, అమ్మా. అది అచ్చి వచ్చిన బాటు అని నా నమ్మకం. అది పోయాక కొత్త రాకెట్‌తో, కొత్త చోటులో, పెద్ద ప్లేయర్స్‌తో ఆడటం మాటలు కాదు. వూరికే ఎందుకు వెళ్ళి, అవమాన పడి రావటం? నే నేం చెప్పినా మాస్టారు వినరు. కాస్త నాన్నగార్ని వెళ్ళి ఏదో ఒకటి చెప్పేసి రమ్మనమ్మా. ప్లీజ్!"

అన్నీ వింటూనే ఉన్నాను.

నాకూ కొన్ని సెంటిమెంట్లూ, నమ్మకాలూ ఉన్నాయి. చాలా మంది పెద్ద పెద్ద ప్లేయర్స్‌కోనే ఉండటం విన్నాను అయినా, వా డలా పూర్తిగా నిరుత్సాహ పడటాన్ని సమర్ధించ లేకపోతున్నాను.

వాడిలో సహజంగా ఉన్న నేర్పు, నెలల తరబడి చేసిన ప్రాక్టీసు—అన్నీ ఒక్క రోజులో, రాకెట్ విరిగిపోగానే మాయం అయిపోతాయా? నో! ఇటీజ రాంగ్. నేను నచ్చజెబుతాని అనుకుంటూ గదినించి బయటికి వచ్చాను.

"పోనీ, నే నొక మాట చెబుతాను, వింటావా?" అంటూంది జయ. ఏం చెబుతుందా — అని వాడితోబాటు నేనూ అటు చూశాను ఆసక్తిగా.

"ఆ రాకెట్ నా కిచ్చేసి, నువ్వు భోజనంచేసి హాయిగా నిద్రపో. నే నిప్పుడే మన స్వామీజీ వద్దకి పూజ చేయించి, దీన్ని బ్లెస్ చేయించుకొని వస్తాను. ఏ ఆలోచనా పెట్టుకోకుండా నే చెప్పినట్టు చెయ్యిరా."


నిరుత్సాహంగానే బాటు తీసి వాళ్ళమ్మ చేతికి ఇచ్చి, బట్టలు మార్చు కుందుకు తన గదిలోకి వెళ్ళాడు 'చలా'.



ఏమిటీ లోకం? ఫొటో- ఎం. చంద్రశేఖర్

అంతా చూస్తూనే ఉన్నాను. ఇదేమిటీ విచిత్రం? 'స్వామీ విద్యానంద' దగ్గరికి అప్పుడప్పుడు వెళుతూంటుంది జయ. ఒకటి, రెండుసార్లు నన్నూ తీసుకువెళ్ళింది. కానీ, ఆయన ఇలాంటి మంత్రాలు, పూజలు చేస్తాడని ఎప్పుడూ చెప్పలేదే?

బీరువాలోంచి బట్టలు తీసుకుందుకు ఇటు వచ్చింది జయ. "ఏమిటోయ్ నీ పిచ్చి? మంత్రాలకి చింతకాయలు రాలతాయా? రాకెట్‌కి మంత్రం వేయిస్తావా? ఇలాంటి పనికిరాని నమ్మకాలు పిల్లల్లో కల్పించటం మంచిది కాదు. తెలుసా?"



"అబ్బ! వూరుకుందురూ? నే నసలే వీడి కెలా ధైర్యం చెప్పి పంపాలా అని తంటాలు పడుతూంటే, ఒక మాటయినా అడలేదుకానీ, పెద్ద ఉపన్యాసా లిమ్మంటే ఇస్తారు" అని చీర, జాకెట్ తీసుకుని, "కాస్త అవతలికి వెళ్ళండి" అని నన్ను తరిమేసి తలుపు వేసుకుంది.

నాలు గడుగులు వేసి, వంట గదిలోకి తొంగి చూశాను.

పిల్లలిద్దరూ టేబిల్ ముందు కూర్చుని అన్నం తింటున్నారు. 'చలా' ముఖం ఇంకా డల్‌గానే ఉన్నా, చెల్లె లేదో అడుగుతూంటే, చిరునవ్వుతోటే జవాబిస్తున్నాడు.

"ఆకలివేస్తే మీరు తినేయుండి. నేను ఒక గంటలో తిరిగి వస్తాను" అనేసి బయటి తలుపు దగ్గరికి లాగేసి వెళ్ళిపోయింది జయ.

• • • •

మా వాడు గెలుపు సాధించి, తిరిగి వచ్చాడు.

ఇంట్లో అడుగు పెట్టగానే, 'చలా', "అమ్మా! స్వామీజీ ఏ మంత్రం వేశారో కానీ, నా కీ రాకెట్ బాగా మాటయింది. అక్టోబర్‌లో ఢిల్లీకి వెళ్ళేటప్పుడు ఇదే తీసుకు వెళతాను. ఆలిండియా ఛాంపియను కావటం ష్యూర్!" అన్నాడు వాళ్ళ అమ్మతో.

ముసిముసి నవ్వులతో నా వైపు చూసింది జయ. ఆ చూపులో కొడుకు సాధించిన విజయానికి తనే కారణం అన్న గర్వం కనిపించింది నాకు.

రాత్రి పడుకునే ముందు అడిగాను జయను.

"మొత్తానికి మీ స్వామీజీ ఏ మంత్రం వేశారో కానీ బాగా పని చేసింది కదూటే!" అన్నాను తమాషాగానే. మంత్రమో, తంత్రమో మా వాడు గెలిచాడు. అంతకంటే ఏం కావాలి?

"నిజంగానే మంత్రం వేయించుకు వచ్చాననీ, దానివల్లే వాడు గెలిచాడనీ అనుకుంటున్నా రేమిటి? హయ్యో రామా!" అని నవ్వుతూంది.

ఆమె ముందు ఫూల్ కావటం ఇష్టంలేక, "అదేం కాదులే. మరి, ఆ వేళ రాకెట్ పుచ్చుకుని వెళ్ళావుగా?" అన్నాను.

"ఉదయంనించి పని ఎక్కువ అయి, అలసటగా ఉంటే, అలా మా ఫ్రెండ్ సుబ్బులక్ష్మి ఇంటికి వెళ్ళి కాస్సేపు కూర్చుని వచ్చేశా నంతే."

"ఎందుకూ?"

"ఎందు కేమిటి? రాకెట్ విరిగిపోగానే, ఏదో మునిగిపోయినట్లు వాడు నిరుత్సాహపడిపోతూంటే ఏం చేసేది? ఏదో విధంగా విశ్వాసం కల్పించాలిగదా మరి?"

అర్థం అయింది. మా వాడికి విశ్వాసం కలిగించి గెలిపించిన ట్రిక్ మంత్రం. జయ సమయస్ఫూర్తికి మనసులో మెచ్చుకున్నాను.

"ఒకవేళ వాడు ఓడిపోయి వచ్చి ఉంటే?" ఆమెను ఉడికించాలనే అన్నాను.

"ఓడిపోతే పోనీ. అంత దూరం వెళ్ళి ఆడి రావటం కావాలి మనకు. ఆఫ్టరాల్! ఆట అన్నాక ఎవరో ఒకరు గెలిస్తే మరొకరు ఓడిపోవలసిందే కదా? మనవాడికే ఓటమి వస్తే, అప్పటి కింకేదో ఆలోచన చేసేదాన్ని సర్ది చెప్పేందుకు" అంది జయ. *